సాక్షి
వైఎస్సార్ జిల్లా
ఆదివారం । 24 । నవంబర్ । 2024



మహిమాన్వితుడు మునెయ్యస్వామి
భక్తులు కోరిన కోరెక్కుల తీర్చే వాడిగా మునెయ్యస్వామి ప్రసిద్ధి చెందాడు.సోమవారం మునెయ్యస్వామి తిరునాల సందర్భంగా ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. -8లో



టీడీపీ నాయకుల దౌర్జన్యం
వ్యవసాయ సాగు భూమిలో ఉన్న విద్యుత్ స్తంభాలను టీడీపీ నాయకులు జేసీబీలతో ధ్వంసం చేయడమే కాకుండా పొలమే మాది అంటూ దౌర్జన్యానికి దిగారు. -8లో

గరిష్టం/కనిష్టం
31.4/18.9

వాతావరణం
జిల్లాలో శనివారం 18.9 - 31.4 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 0.9 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

నేడు సర్వసభ్య సమావేశం
కడప ఎడ్యుకేషన్: ది కడప ఎలిమెంటరీ, సెకండరీ స్కూల్ టీచర్స్ కో ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ సర్వసభ్య సమావేశం ఈనెల 24న ఉదయం 9 గంటలకు కడప నగర సమీపంలోని పబ్బాపురం ఆఫీస్‌లో జరగనుంది. ఈ విషయాన్ని అధ్యక్ష, కార్యదర్శులు విశ్వనాథ రెడ్డి, బాల శౌరిరెడ్డి శనివారం తెలిపారు. జిల్లాలోని సొసైటీ సభ్యులందరూ సమావేశానికి హాజరుకావాలని కోరారు.

నేటి నుంచి అండర్-23 వన్డే క్రికెట్ మ్యాచ్‌లు


కడప స్పోర్ట్స్: కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానం, కేఎస్ఆర్ఎం, కేఓఆర్ఎం మైదానంలలో ఈనెల 24 నుంచి 30వ తేదీ వరకు ఏసీఏ అండర్-23 వన్డే పురుషుల క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నారు. ఈ పోటీల్లో అనంతపురం, ప్రకాశం, తూర్పుగోదావరి, రెస్టాఫ్ సౌత్, రెస్టాఫ్ సెంట్రల్, రెస్టాఫ్ నార్త్ జట్లు తలపడనున్నాయి

రేపు వ్యాసరచన పోటీలు
కడప ఎడ్యుకేషన్: రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని 25వ తేదీ ఉదయం 10 గంటలకు కడపలోని సీఎస్ఐ స్కూల్ ఆవరణలో ఉన్న డీసీఈబీలో విద్యార్థులకు కాంపిటీషన్స్ నిర్వహిస్తున్నట్లు డీఈఓ మీనాక్షి తెలిపారు. ఇందులో భాగంగా వ్యాసరచన, వక్తృత్వ పోటీలు, దేశభక్తి గీతాలాపన, క్విజ్ తదితర అంశాలపై పోటీలు ఉంటాయన్నారు. మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు ప్రతి మండలం నుంచి ప్రతి అంశానికి సంబంధించి ఒక విద్యార్థిని పోటీలకు పంపాలని డీఈఓ సూచించారు.

విరాళం అందజేత


నగదును మఠం సిబ్బందికి ఇస్తున్న భక్తులు

బ్రహ్మంగారిమఠం: ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిదమాంబల నిత్య కల్యాణం కోసం శనివారం హైదరాబాదులోని దూల్‌పల్లెకు చెందిన భక్తులు మాణిక్యరాము,సరిత దంపతులు రూ 1,00116 నగదు ఇచ్చారు. దేవస్థానం మేనేజర్ ఈశ్వరాచారి తరపున సిబ్బంది నగదుకు సంబందించి రశీదు భక్తులకు అందించారు. పిట్‌పర్సన్ శంకర్‌బాలాజీ మాట్లాడుతూ బి.మఠం అభివృద్ధికి భక్తుల సహకారం ఉండాలన్నారు.

26న జీవశాస్త్ర ఉపాధ్యాయులకు శిక్షణ
కడప ఎడ్యుకేషన్: ఆధునిక కాలానికి అనుగుణంగా విద్యార్థుల్లో శాస్త్రీయ జిజ్ఞాసను పెంపొందించడానికి జీవశాస్త్ర ఉపాధ్యాయులకు 26వ తేదీ హ్యాండ్స్ అన్ ఎక్స్‌పరిమెంట్స్‌పై ఒక్కరోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డీఈఓ మీనాక్షి తెలిపారు. కడపలోని పురుషుల కళాశాల జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. కడప, అట్లూరు, బద్వేల్, సీకేదిన్నె, చెన్నూరు. గోపవరం, కమలాపురం, ఖాజీపేట, సిద్దవటం, వల్లూరు, ఒంటిమిట్ట మండలాల్లోని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలో పని చేస్తున్న జీవశాస్త్ర ఉపాధ్యాయులు హాజరు కావాలని,నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని డీఈఓ మీనాక్షి సూచించారు.

ఆర్ట్ క్యాంపు మెంటార్‌గా కోట మృత్యుంజయ రావు


వైవీయూ: ముంబైలోని కోకుయో క్యామ్లిన్ ఆర్ట్ ఫౌండేషన్ నిర్వహిస్తున్న దక్షిణ భారతదేశ పెయింటింగ్ క్యాంపునకు రెండు తెలుగు రాష్ట్రాల తరపున మెంటార్‌గా వైవీయూ లలిత కళా విభాగాధిపతి డాక్టర్ మృత్యుంజయరావు ఎంపికయ్యారు.ఈ మేరకు క్యామ్లిన్ ఫౌండేషన్ నుంచి ఆయనకు ఉత్తర్వులు అందాయి. ఈ నెల 25 నుంచి 30 తేదీ వరకు కర్ణాటక రాష్ట్రం హంపిలో ఉన్న హంపి యూనివర్సిటీ క్యాంపస్‌లో ఈ క్యాంపు నిర్వహించనున్నారు. దక్షిణ భారత దేశంలోని అన్ని ఫైన్ ఆర్ట్స్ కాలేజీల నుండి ఎంపిక చేయబడిన దాదాపు 80 మంది యువ చిత్రకారులు పాల్గొంటున్నారు. కాగా వైవీయూ లలిత కళా విభాగంకు చెందిన బీఎఫ్ఏ 4వ సంవత్సరం విద్యార్థి డి. ముత్యం ఈ వర్క్‌షాప్‌నకు ఎంపికయ్యాడు. 80 మంది చిత్రించిన చిత్రాలను ముంబై జహంగీర్ ఆర్ట్ గ్యాలరీలో ప్రదర్శన చేస్తారు. అమ్ముడుపోయిన చిత్రాల నగదును ఆయా యువ చిత్రకారులకు క్యామ్లిన్ ఫౌండేషన్ వారు అందజేస్తారు. డాక్టర్ మృత్యుంజయరావుకు యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య కె. కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య పుత్తా పద్మ, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

ఇసుక తోడేళ్లు!

- అర్ధరాత్రిళ్లు, తెల్లవారుజామున ఇష్టానుసారంగా ఇసుక తరలింపు
- పదులసంఖ్యలో పట్టుబడుతున్న వాహనాలు
- జిల్లా నుంచి బెంగళూరుకు తరలించేందుకు ప్రణాళిక



ఇసుక రవాణా చేస్తూ పట్టుబడిన ట్రాక్టర్లు



నారాయణ నెల్లూరు వద్ద ఇసుక ను తరలించడంతో ఏర్పడిన గోతులు (ఫైల్)

సాక్షి రాయచోటి: దీపం ఉండగానే ఇల్లు చక్కదిద్దుకోవాలన్న నానుడిని కూటమి నేతలు బాగా ఒంటబట్టించుకున్నారు. అధికారంలో ఉన్నప్పుడే అక్రమంగానైనా సరే ఆర్థికంగా బలపడాలని గట్టిగా నిర్ణయించుకున్నారు. అందులో భాగంగానే దోపిడీకి తెర తీస్తున్నారు. ఇటీవల జరిగిన మద్యం టెండర్లలో మొదలు ఇసుక వ్యవహారం దాకా వ్యూహం ప్రకారం ముందడుగు వేస్తున్నారు. ముఖ్యంగా ఇసుక అక్రమ రవాణాలో చెలరేగిపోతున్నారు. దీనికి తోడు 'ఉచిత ఇసుక'ను వరంగా మార్చుకున్నారు. అవును.. ఉచిత ఇసుక పేరుతో రాత్రికి రాత్రే.... తెల్లవారుజామున నదుల నుంచి జేసీబీలు పెట్టి టిప్పర్లతో ఇసుకను సరిహద్దులు దాటిస్తున్నారు. జిల్లాలో నాలుగైదు స్టాక్ పాయింట్లు ఉన్నా అవి కూడా టీడీపీ వారికే దక్కినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో తెలుగుదేశం పార్టీకి చెందిన నాయకులు ప్రత్యేకంగా టిప్పర్లను పెట్టుకుని ఇసుక వ్యాపారం సాగిస్తుండడం గమనార్హం.

తిరగబడుతున్న జనం

ఇసుక అక్రమ రవాణాను రాత్రిళ్లు ఎడతెరిపి లేకుండా తరలిస్తుండడంతో గ్రామస్తులు తిరగబడుతున్నారు. 15 రోజుల కిందట పెనగలూరు మండల పరిధిలోని నారాయణ నెల్లూరు గ్రామస్తులు తిరగబడి టిప్పర్లను కూడా అధికారులకు పట్టించారు. తర్వాత చుట్టుపక్కల గ్రామాల పరిధిలో ఇసుక కోసం ఎవరూ రావద్దని హెచ్చరికలు చేశారు. అలాగే వైఎస్సార్ జిల్లాల వేంపల్లె పరిధిలోని పాపాఘ్ని నది నుంచి ఇష్టానుసారంగా ఇసుకను తోడుతుండడంతో భూగర్భ జలాలు అడుగంటుతాయని జనం రోడ్డుపైకి వచ్చారు. అంతేకాకుండా జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సవితకు కూడా ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని విన్నవించారు. సిద్దవటం మండల పరిధిలోని జంగాలపల్లె వద్దగల నదిలోకి ఎవరూ రాకుండా చుట్టూ గుంతలు తీశారు. ఇలా ఇక్కడే కాదు....అనేక చోట్ల జనాలు ఇసుక వ్యవహారంపై చైతన్యవంతులై అడ్డుకుంటున్నారు. జనం తిరగబడుతున్న నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో అధికారులు సైతం అక్రమార్కులపై దృష్టి సారిస్తే అక్రమ వ్యవహారాలకు అడ్డుకట్ట వేసేందుకు అవకాశం ఉంటుంది. మరి ఆ దిశగా అధికారులు దృష్టిసారించి అడ్డుకట్ట వేస్తారో... అమ్ముడుపోయి అక్రమాలకు వంత పాడుతారో.. అంతా వారి చేతుల్లోనే ఉంది.

అర్ధరాత్రి నుంచి తెల్లవారుజామువరకు
వైఎస్సార్ జిల్లాతోపాటు అన్నమయ్య జిల్లాలో అర్ధరాత్రి మొదలుకొని తెల్లవారుజాము వరకు ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. పగలైతే కెమెరాలు...అధికారుల కళ్ల బడతామని రాత్రికి రాత్రే ఇసుకను యథేచ్ఛగా తరలిస్తున్నారు. కొంత మంది వరుసబెట్టి ట్రాక్టర్లతో తరలిస్తుండగా మరి కొన్నిచోట్ల ప్రొక్లెయిన్లు పెట్టి టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. ఇదేమని అడిగే 'మా ఇష్టం ..మా ప్రభుత్వమం'టూ బహిరంగంగా వ్యాఖ్యానిస్తుండడం గమనార్హం. ఇసుకను స్థానికంగా డిమాండును బట్టి అందించడం, ముందుగా చేసుకున్న ఒప్పందాల మేరకు బయటి ప్రాంతాలు, రాష్ట్రాలకు సరిహద్దులు దాటిస్తున్నారు.



రాత్రి సమయంలో ఇసుక తరలిస్తూ పట్టుబడిన లారీ

పట్టుబడినా... తగ్గని అక్రమ రవాణా
ఇటీవల అధికారులు దాడులు చేసి వాహనాలను సీజ్ చేయడంతోపాటు జరిమానా విధించినా అక్రమ వ్యవహారాలు ఆగడం లేదు. కేవలం నెల రోజుల వ్యవధిలోనే నందలూరులో రెండుమార్లు జేసీబీలతోపాటు టిప్పర్లు పట్టుబడ్డాయి. నాలుగు రోజుల కిందట ఒంటిమిట్టలో కూడా సుమారు 10 ట్రాక్టర్ల వరకు పట్టుబడ్డాయి. అంతకుముందుపు కూడా ఒంటిమిట్టలో భారీగా టిప్పర్లను పట్టుకున్న సందర్భాలు ఉన్నాయి. ప్రొద్దుటూరు పరిధిలోని చౌడూరుతోపాటు ఇతర ప్రాంతాల్లో కూడా అధికారులు దాడులు నిర్వహించి ఇసుక వాహనాలను పట్టుకున్న ఘటనలు ఉన్నాయి. అధికార పార్టీకి చెందిన వారి వాహనాలు కావడంతో పెద్దల నుంచి విపరీతమైన ఒత్తిళ్లు వచ్చినట్లు తెలుస్తోంది. దీంతో ఆయా అధికారులు ఇక పగలు నిఘా ఉంచి రాత్రి సమయంలో చేతులెత్తేస్తున్నారు. ఇదే అదునుగా ఇసుకాసురులు జోరు పెంచారు. వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల పరిధిలోని చెయ్యేరు, పాపాఘ్ని, పెన్నా, బాహుదా, మాండవ్య, పెద్దేరు తదితర నదుల్లో ఎక్కడ పడితే అక్కడ అవకాశం ఉన్న మేరకు నదులను చెరబడుతున్నారు.

25న ఆర్ట్స్ కళాశాలలో జాతీయ సదస్సు
వైవీయూ: కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాల (స్వయంప్రతిపత్తి)లో ఈనెల 25వ తేదీన 'సైన్స్ అండ్ టెక్నాలజీ కోసం అధునాతన మెటీరియల్స్ సంశ్లేషణ' అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జి.రవీంద్రనాథ్, సదస్సు కన్వీనర్ బుసిరెడ్డి సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఈ సదస్సుకు దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి ప్రఖ్యాత శాస్త్రవేత్తలు, పరిశోధకులు, ఆచార్యులు హాజరవుతున్నట్లు తెలిపారు. అధునాతన పరిశోధనల సామర్థ్యాలను పెంపొందించడానికి పరిశోధకులు, శాస్త్రవేత్తలు, పరిశ్రమల నిపుణుల మధ్య విజ్ఞాన భాగస్వామ్యం, సహకారం, నెట్‌వర్కింగ్ కోసం చక్కటి వేదికగా ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

హార్సిలీహిల్స్‌పై కాటేజీల నిర్మాణం
బి.కొత్తకోట: అన్నమయ్య జిల్లాలో అటవీశాఖకు రెవెన్యూ శాఖ కేటాయించిన 40వేల ఎకరాల్లో అడవుల పెంపకం చేపడుతున్నట్లు జిల్లా అటవీశాఖ అధికారి జగన్నాథ్ సింగ్ వెల్లడించారు. శనివారం బి.కొత్తకోట మండలం హార్సిలీ హిల్స్‌పై అటవీ ప్రాంగణంలో ఆయన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ 30 ఏళ్ల క్రితం జిల్లాలో 38 బ్లాక్టుల పరిధిలో రెవెన్యూ భూమి అటవీశాఖకు కేటాయించారన్నారు. ఇందులో కొందరికి డీకేటి పట్టాలు ఇచ్చినట్లు తెలిసిందన్నారు. ఈ పట్టాలను రద్దు చేయించి ఆక్రమణల తొలగింపుకు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ఈ భూమిలో మొక్కల పెంపకం చేపట్టి అడవిగా పూర్తిస్థాయిలో అభివద్ధి చేస్తామన్నారు. హార్సిలీ హిల్స్‌పై రూ.30 లక్షలతో కొత్తగా 5 కాటేజీల నిర్మాణం, పర్యాటకుల కోసం ట్రెక్కింగ్ పాత్, గార్డెన్ నిర్మాణ పనులు చేపట్టామన్నారు. తంబళ్లపల్లె సమీపంలోని మల్లయ్య కొండపై భక్తుల కోసం రూ.50 లక్షలతో కాటేజీల నిర్మాణం చేస్తున్నామన్నారు. కర్ణాటక-ఆంధ్ర సరిహద్దుల్లో మూతపడిన చెక్ పోస్టులను తిరిగి తెరిపించేందుకు కషి చేస్తామన్నారు. ఆయన వెంట సెక్షన్ ఆఫీసర్ అడపా శివకుమార్, సిబ్బంది ఉన్నారు.

కొండలు.. కొల్లగొట్టేస్తున్నారు



తోట్లపల్లె వద్ద చిన్న కొండనుంచి రెండు ఇటాచీలతో మట్టి తరలిస్తున్న అక్రమార్కులు

ప్రభుత్వ భూమిలో మట్టి తరలిస్తున్న అధికారపార్టీ నాయకులు

బ్రహ్మంగారిమఠం: కొండలు, రాళ్ల గుట్టలు, ప్రభుత్వ భూములు ఇలా ఏవి కనబడితే అవి కొల్లగొట్టేస్తున్నారు.. కొందరు అక్రమార్కులు. అధికార పార్టీ నేతల అండతో మట్టిని తవ్వి తరలిస్తున్నా.. అధికారులు పట్టించుకోవడంలేదు. దీంతో రెవెన్యూ శాఖలో లక్షల రూపాయల ఆదాయానికి గండిపడుతోంది. మండలంలోని తోట్లపల్లె అచలానంద ఆశ్రమం సమీపంలో చెరువు అలుగు వంక వద్ద తోట్లపల్లె ఎస్సీలకు చెందిన తొమ్మిది ఎకరాల భూములు ఇటీవల స్థానిక రియల్ ఎస్టేట్ వ్యాపారులు, అధికారపార్టీ నాయకులు కలిసి కొనుగోలు చేశారు. ఎకరా పొలం దాదాపు రూ 43 లక్షలు పలికింది. ఈ పొలం రోడ్డుకు కింది భాగంలో ఉండడంతో చదును చేయాలనుకున్నారు. పలుగు రాళ్లపల్లె పార్టు-4లో భూములపై కన్నేశారు. సర్వేనెంబర్ 2080-1 94 సెంట్ల రాళ్లగుట్ట, 2080లో 16 సెంట్ల వాగు, 2082లో 2.25 ఎకరాల భూములు రెవెన్యూ ఆధీనంలో ఉన్నాయి. వీటి పక్కన భూములు కొన్న వ్యాపారులు అక్కడ చదును చేసేందుకు గుట్టలను సైతం పిండి చేస్తున్నారు. రెండు ఇటాచీలు తెప్పించి ప్రభుత్వ భూముల్లో లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి తరలిస్తున్నా గ్రామ నౌకర్, వీఆర్వోలు కన్నెత్తి చూడడం లేదు. రెవిన్యూ ఆదాయానికి గండి కొడుతూ.. చిన్న కొండలు పిండి చేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు.

ప్రభుత్వానికి నష్టం కల్గిస్తే చర్యలు

తోట్లపల్లె వద్ద ఎస్సీలకు చెందిన పట్టా భూములను కొందరు కొన్న మాట వాస్తవం. ఆ భూముల చదునుకు రెవిన్యూ ఆధీనంలో ఉన్న చిన్న కొండలనుంచి మట్టి తరలిస్తున్నట్లు నాకు ఎవరూ తెలియజేయలేదు. సమాచారం ఇస్తే మట్టి తరలింపు నిలిపివేస్తాం. ప్రభుత్వానికి నష్టం కలిగిస్తే చర్యలు తీసుకుంటాం. - దామోదర్‌రెడ్డి, తహసీల్దారు

అదానీతో ఎలాంటి ఒప్పందం చేసుకోలేదు
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి



మాట్లాడుతున్న పి. రవీంద్రనాథ్‌రెడ్డి

కడప కార్పొరేషన్: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సారథ్యంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అదానీ గ్రూప్‌తో ఎలాంటి ఒప్పందం చేసుకోలేదని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, కమలాపురం మాజీ ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. కడపలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి వైఎస్ జగన్‌పై, వైఎస్సార్‌సీపీ నాయకులపై బురదజల్లే కార్యక్రమం చేస్తున్నారన్నారు. గోబెల్స్ ప్రచారం చేస్తూ 7 నెలల కాలం గడిపేశారని, అప్పులు తప్ప చేసిందేమీ లేదన్నారు. వరదలు, టీటీటీ లడ్డు, వైఎస్ జగన్ కుటుంబ కలహాలు వంటి అంశాలను రాజకీయాలకు ఉపయోగించుకున్నారన్నారు. ఇప్పుడు ఆదానీతో ఒప్పందాలు అంటూ కొత్త కథలు అల్లుతున్నారని మండిపడ్డారు. విద్యుత్ రంగాన్ని బలోపేతం చేసేందుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేశారన్నారు. చంద్రబాబు తన ఐదేళ్ల పాలనలో డిస్కంలకు రూ.13వేల కోట్లు ఇస్తే, వైఎస్ జగన్ తన పాలనలో రూ.47వేల కోట్లు ఇచ్చారన్నారు. చంద్రబాబు అమరావతిలో తాత్కాలిక అసెంబ్లీ, సచివాలయం నిర్మిస్తే...వైఎస్ జగన్ దూరదృష్టితో తీరప్రాంతంలో ఫిషింగ్ హార్బర్లు అభివృద్ధి చేయడానికి కృషి చేశారన్నారు. రైతులకు 9 గంటలు నాణ్యమైన విద్యుత్ అందించడానికి సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సెకీ)తో ఒప్పందం చేసుకున్నారని, కేంద్ర ప్రభుత్వం ఇంటర్ స్టేట్ ట్రాన్స్‌మిషన్ చార్జీలు రద్దు చేసిన తర్వాతే ఆ ఒప్పందం కూడా చేసుకున్నారని తెలిపారు. సోలార్ పవర్ ఉత్పత్తి చేసే అన్ని సంస్థలతో సెకీ ఒప్పందాలు చేసుకుందని, అందులో అదానీ గ్రూప్ కూడా ఉందన్నారు. 2019లో చంద్రబాబు ప్రభుత్వం సోలార్ పవర్‌ను రూ.5.90లతో, విండ్ పవర్‌ను రూ.4.63లతో కొనుగోలు చేసేందుకు 25 ఏళ్లకు ఒప్పందం చేసుకుందని, వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం కేవలం రూ.2.49లకే కొనుగోలు చేసేందుకు ఒప్పందం చేసుకుందని గుర్తు చేశారు.సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పులి సునీల్ కుమార్, బీహెచ్ ఇలియాస్, శ్రీరంజన్‌రెడ్డి, త్యాగరాజు, రామక్రిష్ణారెడ్డి పాల్గొన్నారు.

ప్రకృతి విస్తరణకు ప్రణాళిక

- ప్రతి మండలంలో 80 శాతం మేర ప్రకృతి సేద్యం సాగుకు చర్యలు
- పెండ్లిమర్రి మండలం మోడల్‌గా ఎంపిక
- మహిళా సంఘాలకు మొదలైన అవగాహన సదస్సులు



పెండ్లిమర్రి మండలంలో ప్రకృతి వ్యవసాయి పద్ధతిలో సాగు చేసిన మిరపపంట



కడప అగ్రికల్చర్: రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక మందులు వాడకుండా ప్రకృతిలో లభించే సహజ సిద్ధమెన పదార్థాలతో తయారు చేసుకున్న జీవామృతం, కషాయాల వాడకంతో నిర్వహించేదే ప్రకృతి వ్యవసాయం. భూమి ఉన్న రైతులతోపాటు భూమి లేని వారు సైతం తమ ఇంటి వద్ద ఉన్న ఖాళీ స్థలాల్లో కిచెన్‌గార్డెన్ వంటి వాటిని ఏర్పాటు చేసుకుని ఆరోగ్యకరమైన కూరగాయలను పండించి వారు తినడంతోపాటు అందరికి అందించాలనే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోంది. ప్రకృతి వ్యవసాయాన్ని రానున్న రోజుల్లో మరింత విస్తరింప చేయాలనే లక్ష్యంతో ప్రకృతి వ్యవసాయ అధికారులు కృషి చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా ప్రతి మండలంలో ప్రకృతి వ్యవసాయం 80 శాతం మేర పెంచే లక్ష్యంగా అడుగులు వేస్తున్నారు. ముందుగా జిల్లాలోని పెండ్లిమర్రిని మోడల్ మండలంగా ఎంపిక చేశారు. ఈ మండలంలో 2027-28 సంవత్సరానికి 80 శాతం మేర ప్రకృతి వ్యవసాయ సాగు విస్తరించే విధంగా చర్యలు చేపట్టారు.

పెండ్లిమర్రి మండలంలో 13 పంచాయతీల్లో...

పెండ్లిమర్రి మండలంలో 19 గ్రామ పంచాయతీలకు 13 గ్రామ పంచాయతీలైన చీమలపెంట, చెర్లోపల్లి, ఇసుకపల్లి, గంగిరెడ్డిపల్లె, గొందిపల్లి, కొత్తగిరియాంపల్లి, నాగాయపల్లి, నందిమండలం, పెండ్లిమర్రి, సంగటపల్లి, తిప్పిరెడ్డిపల్లె, తుమ్మలూరు, ఎల్లటూరులో అందుకు తగ్గ కార్యాచరణను ప్రారంభించారు. ఈ పంచాయతీల్లోని గ్రామాల్లో ఉన్న డ్వాక్రా మహిళా సంఘాలు, గ్రామ సమాఖ్యలతోపాటు మహిళా రైతులకు ప్రకృతి వ్యవసాయ సాగుపై సదస్సులను నిర్వహిస్తూ అవగాహన కల్పిస్తున్నారు. 2024-25 ఏడాదికి ప్రకృతి వ్యవసాయ పంటల సాగు కోసం 2957 మంది రైతులను గుర్తించాల్సి ఉండగా ఇప్పటికి 1412 మందిని గుర్తించారు. వీరంతా ఎలాంటి రసాయనిక ఎరువులు, పురుగుమందులు వాడకుండా పంటలు సాగు చేసేలా చైతన్యం కల్పించారు. అలాగే ఈ పద్ధతిలో పండించే పంటల దిగుబడులను అదే మండలంలో అమ్ముకునే విధంగా మార్కెటింగ్ సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. డీఆర్‌డీఏ సహకారంతో చిన్న తరహా కుటీర పరిశ్రమలను కూడా ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నారు.

ప్రతి సంఘం నుంచి ఇద్దరు ఎంపిక

ప్రకృతి వ్యవసాయానికి సంబంధించి ప్రతి మహిళా సంఘం నుంచి ఇద్దరు లీడ్ ఫార్మర్స్‌ను ఎంపిక చేసి వారికి ఐసీఆర్‌సీ ద్వారా అవగాహన కల్పిస్తూ సాగును ప్రారంభిస్తారు. వారు మిగతా గ్రూపు సభ్యులకు కషాయాలు, ద్రావణాల తయారీపై శిక్షణ ఇస్తారు. ప్రకృతి వ్యవసాయ సాగుపై అవగాహన కల్పిస్తారు. 2027-28 నాటికి మండలవ్యాప్తంగా ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరింప చేయాలనే లక్ష్యంతో సాగుతున్నారు.

పౌష్టికాహారం అందించేందుకు..
ప్రకృతి వ్యవసాయ సాగు ద్వారా పండించే ఉత్పత్తులను అందించేందుకు 13 గ్రామ పంచాయతీల్లో ఎంతమంది గర్భిణులు ఉన్నారు.రక్తహీనత మహిళలు, బాలింతలు, చిన్న పిల్లలు ఎంతమంది ఉన్నారనే వివరాలను ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సేకరించారు.ముందుగా ఐదు పంచాయతీల్లో సర్వే నిర్వహించారు. వీటిల్లో 20 మంది గర్భిణులు, 6 నెలల నుంచి రెండు సంవత్సరాల వయస్సు ఉన్న 78 మంది పిల్లలు, అలాగే 3 నుంచి 6 సంవత్సరాలుండే 138 మంది పిల్లలు ఉన్నట్లు తెలిపారు. వీరికి ప్రకృతి సేద్యం ద్వారా పండించిన చిరుధాన్యాల ఉత్పత్తులను అందించి రక్తహీనతను తగ్గించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు.

- ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ఉత్పత్తులను పార్టిసిపేటరీ గ్యారెంటీ సిస్టమ్(పీజీఎస్) సర్టి ఫికెట్ ద్వారా బహిరంగ మార్కెట్ కంటే 10 శాతం అధిక రేటుతో అమ్ముకునేందుకు వీలుగా అధికారులు కృషి చేస్తున్నారు.

సాగు ఖర్చు సగానికి తగ్గింది...


1.5 ఎకరాల్లో చామంతిపూలు సాగు చేశా. సాధారణ పద్ధతిలో సాగు చేస్తే ఎకరాకు రూ. 90 వేలు ఖర్చు వస్తుంది. ప్రకృతి వ్యవసాయ పద్ధతి వల్ల రూ. 45 వేలే ఖర్చు అయింది. ఈ పద్ధతిలో పండించడం వల్ల పూలు నాణ్యంగా ఉంటున్నాయి. - సులోచన, రైతు, పెండ్లిమర్రి

అవగాహన కల్పిస్తున్నాం


పెండ్లిమర్రి మండలంలోని 13 గ్రామ పంచాయితీల్లో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రారంభించాం.దీనిపై గ్రామాల్లోని డ్వాక్రా, గ్రామ సమాఖ్య మహిళలకు అవగాహన కల్పిస్తున్నాం.
- సందీప్, పెండ్లిమర్రి మండల టీమ్ లీడర్

లక్ష్యాన్ని అధిగమించేందుకు కృషి


రబీ సీజన్‌కు సంబంధించి 27850 మంది రైతుల ద్వారా 32522 ఎకరాల్లో సాగు లక్ష్యంగా పెట్టుకున్నాము. లక్ష్యాన్ని అధిగమించేందుకు కృషి చేస్తున్నాం. మోడల్‌గా ఎంపిక చేసిన పెండ్లిమర్రిలో సాగు పెంచేందుకు చర్యలు చేపట్టాం.
-ప్రవీణ్‌కుమార్,డీపీఎం, ప్రకృతి వ్యవసాయం

క్లుప్తంగా

బాలిక అదృశ్యం


అదృశ్యమైన బాలిక

వల్లూరు (చెన్నూరు) : చెన్నూరు మండలం చిన్నమాసుపల్లి గ్రామానికి చెందిన మారెళ్ళ రాజా కుమార్తె మైనర్ బాలిక అదృశ్యమైంది. ఇంట్లో తల్లిదండ్రులు మందలించారని శుక్రవారం సాయంత్రం మూడు గంటలకు ఎవరు చెప్పకుండా అదృశ్యమైంది. తండ్రి, బంధువులు చుట్టుపక్కల వారి వద్ద విచారించినా ఫలితం లేకపోవంతో శనివారం చెన్నూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు సీఐ పురుషోత్తం రాజు తెలియజేశారు.

కడపలో మహిళ ..


సుజాత (ఫైల్)

కడప అర్బన్ : కడప నగర శివార్లలోని రిమ్స్ పీఎస్ పరిధిలో సరోజినీ నగర్‌లో నివాసం వుంటున్న పి. సుజాత (42) అనే మహిళ ఈనెల 13 వ తేదీ నుంచి కనిపించడంలేదని ఆమె తల్లి కళావతి శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనపై రిమ్స్ పిఎస్ సీఐ సీతారామిరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కొండ చిలువ కలకలం


బాకరాపురంలో కనిపించిన కొండచిలువ

వల్లూరు : మండలంలోని కోట్లూరు గ్రామ పంచాయతీ పరిధిలోని బాకరాపురం గ్రామంలో శనివారం కొండ చిలువ కలకలం రేపింది. గ్రామానికి చెందిన రెడ్డి శేఖర్ అనే వ్యక్తి ఇంటి వెనుక భాగంలో ఉన్న వామి దొడ్డిలో కొండ చిలువ కదలకుండా పడుకుని ఉండడాన్ని గమనించారు. సుమారు 7 అడుగుల పొడవు ఉన్న కొండ చిలువను చూడడానికి స్థానికులు ఆసక్తి చూపారు. అనంతరం రెడ్డి శేఖర్ చాక చక్యంగా కొండ చిలువను పట్టుకుని గ్రామానికి సమీపంలోని వంకలో వదిలి పెట్టారు.

రుణం చెల్లించాలని జడ్జి తీర్పు

కడప అర్బన్ : కడప నగరానికి చెందిన సావిత్రి తిరుపతికి చెందిన పి. చంద్రశేఖర్‌కు గతంలో అక్షరాలా రూ. 5 లక్షలను రుణంగా ఇచ్చారు. ఈ డబ్బులను ఇవ్వలేదని సావిత్రి తరఫున న్యాయవాది గుర్రప్ప నాయుడు కోర్టులో 2023లో పిటిషన్ దాఖలు చేశారు. ఈ దావాను పరిశీలించిన మూడవ అదనపు సివిల్ జడ్జి బాధితురాలికి అసలు, వడ్డీ కలిపి రూ. 8,38,333 లను చెల్లించాలని శనివారం తీర్పునిచ్చారు.

మహిమాన్వితుడు మునెయ్యస్వామి

రేపు తిరునాల మహోత్సవం



ప్రత్యేక అలంకరణలో మునెయ్యస్వామి, ఆలయ గోపురం

ప్రొద్దుటూరు కల్చరల్ : భక్తులు కోరిన కోరెక్కుల తీర్చే వాడిగా మునెయ్యస్వామి ప్రసిద్ధి చెందాడు. మునెయ్యస్వామి సిద్ధపురుషుడిగా, మహిమాన్విత అవధూతగా ఆయన మహిమలు, మహత్యాలు గురించి జిల్లాలోనే కాక రాయలసీమ అంతటా ప్రచారంలో ఉన్నాయి. ప్రొద్దుటూరులోని ముక్తిరామేశ్వరం సాక్షాత్తు శ్రీరామచంద్రునిచే ప్రతిష్ఠించబడిన పుణ్యస్థలం ఇది.

ఆలయ చరిత్ర :
ప్రసిద్ధి చెందిన ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయం పరిసరాలలోనే 400 ఏళ్ల కిందట కర్నూలు జిల్లా బనగానపల్లె యాగంటి నుండి రామేశ్వరానికి 12 ఏళ్ల బాలుడొకడు వచ్చినాడని చెబుతారు. ఆ బాలుడు బయపురెడ్డి అనే వారి ఇంటి వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకూ కూర్చున్నాడన్నారన్నారు. అప్పుడు బయపురెడ్డి రాత్రి కావస్తోంది ఇంటికి వెళ్లు అని ఆ బాలునికి చెప్పగా తనకు ఎవ్వరూ లేరని చెప్పాడు. బయపురెడ్డి ఆ బాలునికి అన్నం పెట్టగా తిని వెళ్లిపోయాడు. అలా రోజూ ఆ బాలుడు బయపురెడ్డి ఇంటికి వచ్చి పోతూ ఉండేవాడు. ఆ బాలుడు కురచగా ఉండి ఉంగరాల జుట్టుతో గోచి మాత్రమే ధరించి ఉండేవాడు. ఎండా, వాన, చలి అనే బాధ ఎరుగనివాడు. ఎవ్వరితో మాట్లాడక, ఏమీ ఎరుగక వీధులన్నీ తిరిగి రాజరాజేశ్వరి ఆలయంలో విశ్రాంతి పొందేవాడట. పెన్నా నది ఒడ్డున ఇసుక దిబ్బల్లో విహారాలు అయన నిత్యకృత్యాలు. యాగంటిలోనే ఆ బాలుడికి అమ్మవారి దర్శనం అయిందని ఆమె ఆదేశానుసారం ముక్తిరామలింగేశ్వరానికి వచ్చినట్లు ప్రతీతి. మౌనవ్రతం పట్టడం చేతనే ఆయనను మునిస్వామి, మునయ్యస్వామిగా ప్రసిద్ధి అయినాడు. ఆయన చాలా వేగంగా నడిచేవాడట, తోటి బాలురతో కలిసి బొంగరాలు, గోలీలు ఆడి వారి గోలీలు, బొంగరాలు పగులగొట్టేవాడట. పెన్నా ఇసుక తీసుకొని ఆ పిల్లల చేతిలో పోస్తే అది పంచదారగా మారేదని, అందుకే ఆయనను పిల్లలు ఎప్పుడూ అనుసరించే వారని చెబుతారు. అడవిలో పులులతో, పాములతో ఆడుకొనేవాడట. ఆయనకు కోళ్లు, నెమళ్ల వంటి పక్షులంటే అమితమైన ప్రేమ. వాటిని ఎత్తుకొని, వాటితో ఆడుకొని వదిలేసేవాడని చెబుతారు. మునెయ్యస్వామి కోళ్లను తీసుకొనిపోయి కోసుకొని తినివాడని చెబుతారు. అందుకే ఆయన్ను దొంగ కోళ్ల మునిస్వామిగా కూడా పిలుస్తారు. కానీ ఇది అసత్యమని కొందరు అంటారు. మునయ్యస్వామి అనుగ్రహంతో పుట్టిన పిల్లలకు మునయ్య, మునెమ్మ అని పేరు పెడుతూ తమ ఇంటి దేవునిగా స్వామి వారిని కొలుస్తున్నారు.

స్వామికి మహిళలే పూజలు
స్వామికి మహిళలే పూజలు నిర్వహించడం విశేషం.

ఆనాటి నుంచి ప్రతి చివరి కార్తిక సోమవారం నాడు ఘనంగా మునయ్యస్వామి తిరునాల నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. కోళ్లను, మేకలను బలి ఇస్తారు. తలనీలాలు, పుట్టు వెంట్రుకలను ఇస్తారు. ఆలయ గోపురంపై చెక్కిన మనోహర శిల్పాలు అద్భుత రమనీయతను సంతరించుకున్నాయి. ఈ ఆలయంలో నిర్మలమైన ప్రశాంత వాతావరణం ప్రతి ఒక్కరినీ ఆహ్లాదపరుస్తుంది. ఆలయ గోపురం లోపలి వైపున గాంధీజీ, జవహర్ లాల్ నెహ్రూ, సుభాష్ చంద్రబోస్ వంటి జాతీయ నాయకుల విగ్రహాలు భక్తులలో దేశ సమైఖ్యతను, దేశభక్తిని పెంపొందిస్తున్నాయి. ఆలయం లోపల గోపిక వస్త్రాపహారుడైన శ్రీకృష్ణుని విగ్రహం, నంది విగ్రహం, ఆదిశేషునిపై విష్ణుమూర్తి, రథసారథిగా శ్రీకృష్ణుడు వంటి ఎన్నో సుమనోహరమైన శిల్ప కళా సంపద మనస్సును రంజింపచేస్తోంది. ఈ ఆలయానికి ఎటువంటి ఆలయ మాన్యాలు కానీ, భూములు కానీ, ఆస్తులు కానీ లేవు. కేవలం భక్తులు సమర్పించిన కానుకులతో ఆలయం నడుస్తోంది. కోరికలు నెరవేరిన భక్తులు తమ మొక్కుబడిగా ఆలయ అభివృద్ధికి కృషి చేయడం విశేషం.

ప్రత్యేక ఏర్పాట్లు
తిరునాల సందర్భంగా ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. తినుబండారాలు, బొమ్మలు, గాజులు, తదితర దుకాణాలను ఏర్పాటు చేస్తున్నారు. రాయలసీమలోని వివిధ ప్రాంతాలతో పాటు తెలంగాణ, కర్నాటక, తమిళనాడు ప్రాంతాలకు చెందిన భక్తులు స్వామివారిని దర్శించనున్నారు. తలనీలాలు సమర్పించడంతో పాటు కోళ్లు, మేకలు బలి ఇచ్చి తమ మొక్కులు తీర్చుకోనున్నారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు చర్యలు తీసుకుంటున్నారు.

మునయ్య స్వామి మహిమలు

మునయ్య స్వామి ఉన్నట్టుండి అదిలించే వాడని, ఏమని అడిగితే అడవిలో గోవులపై పులి దాడి చేయబోతే అదిలించి తరిమేశానని చెప్పేవాడట. రైతులు వర్షం పడలేదని స్వామిని అడుగగా, అడిగిన రోజు రాత్రే వర్షం కురిసేదని కొందరు అన్నారు. బయపురెడ్డి ఇంటికి రోజూ వెళుతూ అతనికి తన మహిమల ద్వారా వారి ఇంటి ఇలవేల్పుగా మారాడు. తనకు ఒక ఆలయం నిర్మించమని కోరగా బయపురెడ్డి నిర్మించిన ఆలయంలో తన 40వ ఏట కార్తీకమాస చివరి సోమ వారం నాడు జీవసమాధి అయ్యాడు. జీవ సమాధి అయినప్పుడు వెలిగించిన దీపం ఇప్పటికీ అఖండ దీపంగా వెలుగుతూ మనకు దర్శనం ఇస్తుంది.

ఆయుర్వేద మందులషాపుపై విజిలెన్స్ అధికారుల దాడి

కడప అర్బన్ : కడప రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి జి. శ్రీనివాసరావు ఆదేశాల మేరకు విజిలెన్స్ అధికారులు డాక్టర్ ఎస్. మురళి, సీనియర్ మెడికల్ ఆఫీసర్, రిమ్స్ ఆయుర్వేద మెడిసిన్ వారితో కలిసి శనివారం సాయంత్రం కడపలోని గుంతబజార్‌లో ఉన్న ఆరోగ్యరక్ష అనే ఆయుర్వేద మందుల షాపును తనిఖీ చేశారు. ఈ తనిఖీలో ఎలాంటి వైద్య అర్హతలు లేకుండా పేషెంట్లకు ఆయుర్వేద మందులను ప్రభావతి ఇవ్వడం గుర్తించారు. ఎలాంటి అనుమతులు లేకుండా తైలాలు చేసే స్టిక్కర్లు అతికించి అమ్మడం గుర్తించారు. మ్యాజికల్ రెమెడీస్ ఉన్న మందులను గుర్తించి సీజ్ చేశారు. తదుపరి చర్యల కోసం సీనియర్ మెడికల్ ఆఫీసర్‌కు అప్పగించారు. వైద్య అర్హత లేని వారు ఈ విధంగా మందులను ఇస్తే కఠినచర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎఫ్ఆర్ఓ జె, మురళీకృష్ణ, డీసీటీఓ బాబుమోజెస్, సీనియర్ మెడికల్ ఆఫీసర్ మురళీబాబు పాల్గొన్నారు.

ఎరువుల గోడౌన్ చోరీ కేసులో 8 మంది అరెస్ట్

కడప అర్బన్ : కడప నగర శివార్లలోని రామాంజనేయపురంలోని ఎరువుల గోడౌన్‌లో ఇటీవల చోరీ జరిగింది. ఈ కేసులో 8 మంది నిందితులను అరెస్ట్ చేసినట్లు రిమ్స్ పిఎస్ ఎస్ఐ యు.వై. జయరాములు తెలిపారు. కడపకు చెందిన ఉపేంద్ర, రాజశేఖర్, సాయి, రాజేష్, నరసింహ, సతీష్, చైతన్య ఈనెల 20 వ తేదీన గోడౌన్ తాళాలను పగులగొట్టి ఎరువులు, మందులను అపహరించారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి రూ. లక్ష విలువైన ఎరువులను స్వాధీనం చేసుకున్నారు.

డిసెంబర్ 14న జాతీయ లోక్ అదాలత్


మాట్లాడుతున్న సీనియర్ సివిల్‌జడ్జి పద్మజ

పీలేరు రూరల్ : డిసెంబర్14వ తేదీన నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసుల పరిష్కారానికి కృషి చేయాలని చిత్తూరు జిల్లా న్యాయసేవా అధికారసంస్థ కార్యదర్శి, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి యంవిఎస్ పద్మజ అన్నారు. శనివారం స్థానిక కోర్టులో న్యాయవాదులు, పోలీసులతో జాతీయ లోక్‌అదాలత్‌పై సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జడ్జి మాట్లాడుతూ కక్షిదారులు ఇరువర్గాలను ఒప్పించి రాజీకి ప్రయత్నం చేయాలని సూచించారు. అనంతరం స్థానిక సబ్‌జైల్‌ను తనిఖీ చేశారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి కె.రవి, జూనియర్ సివిల్‌జడ్జి ఎస్.గాయిత్రి, ఏపీపీ శారద, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బీసీ పురుషోత్తంరెడ్డి, న్యాయవాదులు సుధాకర్‌రెడ్డి, చంద్రశేఖర్, మధుసూదన్‌రెడ్డి, యల్లయ్య, సీఐ యుగంధర్, ఎస్ఐ తదితరులు పాల్గొన్నారు.

మెనూప్రకారం భోజనం అందించాలి :
విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని జిల్లా న్యాయసేవ అధికారి సంస్థ కార్యదర్శి, ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్‌జడ్జి పద్మజ సూచించారు. శనివారం రాష్ట్ర హైకోర్టు ఆదేశాలమేరకు పట్టంలోని చిత్తూరు రోడ్డులోని అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. అలాగే తిరుపతి రోడ్డులోని ఏపీ బాలికల గురుకుల పాఠశాలను తనిఖీ చేసి అక్కడ ఉన్న సమస్యలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. భోజనం పరిశీలించారు. ప్రతి రోజు మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కరుణ, లోకేశ్వరి పాల్గొన్నారు.

వన్యప్రాణుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

ఒంటిమిట్ట : దేశానికి పచ్చని హారంగా ఉన్న అటవీ ప్రాంతాలలో ఎర్రచందనం, వన్యప్రాణుల పరిరక్షణ ప్రతి ఒక పౌరుడి బాధ్యత అని కడప జిల్లా ఇన్‌చార్జ్ డీఎఫ్ఓ దివాకర్ అన్నారు. శనివారం మండల పరిధిలోని చింతరాజుపల్లి అడవి ప్రాంతంలో ఉన్న చీతల్ బేస్ క్యాంప్‌ను, దాసర్లదొడ్డి వద్ద ఉన్న చౌసింగ్ బేస్ క్యాంప్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చౌసింగా బేస్ క్యాంప్‌లోని తుపాకుల పనితీరును ఆయన పరిశీలించారు. అలాగే మండల పరిధిలోని కుడమలూరు, శ్రీరామ ఎత్తిపోతల పంప్ హౌస్ సమీపాన నిర్మిస్తున్న వన విహారి నిర్మాణ పనులు పరిశీలనలో భాగంగా నిర్మాణ చిత్రపటాన్ని పరిశీలించారు. అనంతరం ఎర్రచందనం, వన్యప్రాణుల పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మండల అటవీశాఖ సిబ్బందికి సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈయన వెంట సబ్ డీఎఫ్ఓ స్వామి వివేకానంద, ఇన్‌చార్జ్ ఎఫ్ఆర్ఓ బాల సుబ్రమణ్యం, మండల అటవీశాఖ సిబ్బంది ఉన్నారు.

టీడీపీ నాయకుల దౌర్జన్యం

- పొలంలో విద్యుత్ స్తంభాలు ధ్వంసం
- పోలీసులకు బాధితులు ఫిర్యాదు


టీడీపీ నాయకులు ధ్వంసం చేసిన విద్యుత్ స్తంభం

ఖాజీపేట : వ్యవసాయ సాగు భూమిలో ఉన్న విద్యుత్ స్తంభాలను టీడీపీ నాయకులు దౌర్జన్యంగా జేసీబీలతో ధ్వంసం చేయడమే కాకుండా పొలమే మాది అంటూ దౌర్జన్యానికి దిగారు. ఈ సంఘటన శనివారం పత్తూరు రెవెన్యూ పొలంలో చోటు చేసుకుంది. బాధితుల ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పత్తూరు రెవెన్యూ పొలంలో సర్వేనంబర్ 814 లో 2.77 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఆ భూమి యరికల గురువయ్య అనే వ్యక్తికి ప్రభుత్వం కేటాయించింది. అయితే లబ్ధిదారుడు భూమి తీసుకున్నా ఆ భూమిని సాగు చేసుకోలేదు. లబ్ధి పొందిన కుటుంబం గ్రామంలో నివాసం లేకపోవడం, ఇతర రాష్ట్రాల్లో నివాసం ఉంటున్నారు. ఈ కారణంగా ఆ భూమిని రెవెన్యూ అధికారులు పరిశీలించి 2004లో అనప పద్మవతికి కేటాయించారు. 2005లో ఆ భూమికి సంబంధించి పాసుపుస్తకాలు అందించారు. అలాగే రెవెన్యూ రికార్డులు కల్పించారు. అయితే ఇదే భూమికి సంబంధించి టీడీపీ నాయకుడు సారే పిచ్చినాయుడు ఈ భూమిపై మాకు పూర్తి హక్కు ఉంది. ఆ భూమికి హక్కుదారులం మేమే అని పలుమార్లు పద్మవతి కటుంబంపై పలు మార్లు రెవెర్యూ అధికారుల వద్దకు వెళ్లి ఫిర్యాదు చేశాడు. దీంతో అనప పద్మవతి ఇదే విషయమై 2016లో కోర్టుకు వెళ్లి ఇంజక్షన్ ఆర్డర్ తీసుకొచ్చింది. తాజాగా భూమి ఆన్‌లైన్‌లో నమోదు అయ్యింది. పాసుపుస్తకాలు వచ్చాయి. ఇటీవలే బోరు వేసి కొత్త విద్యుత్ స్తంభాలు నాటారు. శనివారం విద్యుత్ వైరును లాగేందుకు సిద్ధమవుతున్న తరుణంలో టీడీపీ నాయకులు వచ్చి మూడు విద్యుత్ స్తంభాలను ధ్వంసం చేయడంతో గొడవ ముదిరి పోలీసుల వద్దకు చేరింది.

ఫిర్యాదు మేరకు తహసీల్దార్‌కు పంపిస్తున్నాం
భూమి ఎవ్వరిది అనే విషయంపై ఇరువురు ఫిర్యాదులు చేసుకుంటున్నారు. ఈ భూమి అసలు హక్కుదారులు ఎవ్వరనేది తేల్చాలని తహసీల్దార్‌కు పంపిపంచి నివేదిక ఇవ్వాలని కోరుతున్నాం. ఆ నివేదిక మేరకు చర్యలు తీసుకుంటామని సీఐ మోహన్ తెలిపారు.

అటవీ అధికారుల అదుపులో అడవి పందుల వేటగాళ్లు

- రూ.5 లక్షలు చెల్లించాలన్న ఫారెస్ట్ అధికారులు
- సామాజిక మాధ్యమాల్లో వీడియో హల్‌చల్

పెద్దతిప్పసముద్రం : మండలంలోని రాపూరివాండ్లపల్లి పంచాయతీ కాయలవాండ్లపల్లికి చెందిన పలువురు అడవి పందులకు ఉరేసి చంపి వాటి మాంసం విక్రయిస్తున్నారని అటవీ శాఖ అధికారులకు సమాచారం అందింది. సమీప అటవీ ప్రాంతంలో పర్యవేక్షించే వన సంరక్షణ సమితి (వీఎస్ఎస్) గార్డు వెంకటశివ మూగ జీవాలను ఎవరు చంపి మాంసం విక్రయిస్తున్నారో వారి వివరాలను సమగ్రంగా తెలుసుకుని ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించాడు. ఈ నేపథ్యంలో శనివారం అటవీ శాఖ సెక్షన్ అధికారి ముబీన్‌తాజ్, సిబ్బంది గోపాల్, ప్రకాష్‌లు గ్రామానికి చేరుకున్నారు. అనంతరం అధికారులు మాంసం విక్రయదారులతో చర్చించి రూ.5 లక్షలు డిమాండ్ చేసి చివరకు రూ.లక్ష ఇస్తే కేసు లేకుండా చేస్తామని బహిరంగంగా చెప్పినట్లు గ్రామస్థులు తీసిన వీడియో రికార్డ్ సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేసింది. అనంతరం అటవీ అధికారులు మాంసం విక్రయించే ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ఈ విషయంపై సెక్షన్ అధికారి ముబీన్‌తాజ్‌ను వివరణ కోరగా తమకు వచ్చిన సమాచారం మేరకు గ్రామానికి వెళ్లామన్నారు. మూగ జీవాలను చంపినందుకు 1974 యాక్ట్ ప్రకారం గతంలో రూ.25 వేలు అపరాధ రుసుం ఉండేదని, ప్రస్తుతం 2020-2022 అటవీ యాక్ట్ ప్రకారం రూ.లక్ష నుంచి రూ.5 లక్షల జరిమానాతో పాటు కేసు కూడా నమోదు అవుతుందన్నారు. అది కూడా డీఎఫ్‌వో పర్యవేక్షణలోనే విచారణ జరుగుతుందన్నారు. అయితే తాను ఎవరినీ డబ్బులు డిమాండ్ చేయలేదని, డబ్బు ఇచ్చినా ఆ అపరాధ సొమ్ము ప్రభుత్వ ఖజానాకు జమ చేసిన అనంతరం ఆన్‌లైన్ రశీదును మాంసం విక్రయదారులకే ఇస్తామని ఆమె వెల్లడించారు.

కుటుంబ సమస్యలతో మహిళ ఆత్మహత్య


ఆత్మహత్యకు పాల్పడిన స్వాతి

మదనపల్లె : కుటుంబ సమస్యలతో భర్తతో గొడవపడి మనస్తాపం చెందిన మహిళ ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శనివారం సాయంత్రం పట్టణంలో జరిగింది. ఫైర్‌స్టేషన్ సమీపంలో నివసిస్తున్న నరేష్ భార్య జి.స్వాతి(30) శనివారం సాయంత్రం ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. నాలుగేళ్ల క్రితం బి.కొత్తకోట మండలం కాండ్లమడుగుకు చెందిన నరేష్‌తో స్వాతికి వివాహమైంది. నరేష్ కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. వీరికి కుమారుడు తనీష్‌రాజ్(12), కుమార్తె వృతిక(5) ఉన్నారు. అయితే, గత కొంతకాలంగా స్వాతి అనారోగ్యం బారిన పడింది. ఇటీవలే ఆస్పత్రిలో శస్త్రచికిత్స చేయించుకుంది. ఈ క్రమంలో అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులు, కుటుంబసమస్యలు అధికం కావడంతో తరచూ భార్యాభర్తలు గొడవపడేవారు. శనివారం ఇంటి అద్దె చెల్లించే విషయమై మరోసారి భర్త నరేష్‌తో గొడవపడింది. మనస్తాపం చెంది ఇంట్లోనే చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన స్థానికులు తలుపులు పగలగొట్టి వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని శవపరీక్షల నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ ఎరీషావలీ తెలిపారు.

తహసీల్దార్‌పై దాడికి యత్నం

పెద్దతిప్పసముద్రం : మండల తహసీల్దార్ శ్రీరాములు నాయక్‌పై దాడికి ప్రయత్నించిన ఏడుగురు నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నరసింహుడు శనివారం పేర్కొన్నారు. తహసీల్దార్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని నవాబుకోట పంచాయతీ వరికసువుపల్లిలో బయారెడ్డి అనే వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందాడు. అయితే మృతదేహాన్ని ఖననం చేసేందుకు మృతుడి బంధువులు భూమిని తవ్వుతుండగా గ్రామ రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా ప్రభుత్వ భూమిలో ఇష్టారాజ్యంగా ఎక్కడ పడితే అక్కడ మృతదేహాలను ఖననం చేయడం చట్టరీత్యా నేరమని సూచించడంతో అక్కడ ఇరువురి నడుమ వాగ్వాదాలతో గందరగోళ పరిస్థితి నెలకొంది. విషయం తెలుసుకున్న తహసీల్దార్ సిబ్బందితో కలసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహం ఖననం చేసే విషయంలో అటు మృతుడి బంధువులకు ఇటు రెవెన్యూ అధికారుల నడుమ ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంది. అనంతరం ఈ ఘటనలో తనపై దాడికి ప్రయత్నించిన ఏడుగురు వ్యక్తులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ ఫిర్యాదు చేశారు. తహసీల్దార్‌పై దాడికి ప్రయత్నించిన అశ్వర్థరెడ్డి, హరీష్‌తో పాటు వీరి సమీప బంధువులైన మరో ఐదుగురిపై ప్రభుత్వ నిబంధనల ఉల్లంఘన, అధికారులపై దౌర్జన్యం, దాడికి యత్నం, భూ ఆక్రమణలపై కేసు నమోదు చేసామని ఎస్ఐ వెల్లడించారు.

ఐదుగురు లాటరీ విక్రేతల అరెస్ట్

మదనపల్లె : అక్రమంగా లాటరీలు విక్రయిస్తున్న ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు వన్‌టౌన్ సీఐ ఎరీషావలీ తెలిపారు. పట్టణంలోని చెంబకూరురోడ్డులోని మర్రిమాను వద్ద లాటరీలు విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి దాడిచేశామన్నారు. స్థానికంగా ఉంటూ లాటరీలు విక్రయిస్తున్న మహేష్ బాబు(33), రెడ్డెమ్మ(46), శంకర(40), సుధాకర్(52), రియాజ్(48)లను అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి వద్ద నుంచి 82 లాటరీ టికెట్లు, రూ.12,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులపై కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

వీఆర్ఏను దూషించిన భూ ఆక్రమ దారుడిపై కేసు

ఒంటిమిట్ట : మండల పరిధిలోని ఓబులేసుకోన వద్ద శుక్రవారం భూ ఆక్రమణకు పాల్పడుతున్న వ్యక్తిని అడ్డుకునేందుకు వెళ్లిన మహిళా వీఆర్ఏను కులం పేరుతో దూషించిన విషయం విధితమే. వీఆర్ఏని దూషించిన వ్యక్తిపై శనివారం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును నమోదు చేసినట్లు ఒంటిమిట్ట ఎస్ఐ శివ ప్రసాద్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరల మేరకు.. మండల పరిధిలోని ఓబులేశు కోన వద్ద ఉన్న సర్వే నెంబరు. 661లో ప్రభుత్వ భూమిని సుధాకర్ అనే వ్యక్తి అక్రమంగా ట్రాక్టర్లతో చదును చేస్తుండగా రెవెన్యూ అధికారులకు సమాచారం అందింది. పెన్నపేరూరు వీఆర్ఏ శాంత, మరో విఆర్ఏ సుబ్బరాయుడుతో కలిసి భూ ఆక్రమణను అడ్డుకునేందుకు వెళ్లారు. ఇంతలో విషయం తెలుసుకున్న సుధాకర్ రెవెన్యూ సిబ్బంది రాకముందే అతని ట్రాక్టర్‌తో కలిసి ఇంటికి చేరుకున్నారు. ఇంటికి వెళ్లిన విషయాన్ని తెలుసుకున్న రెవెన్యూ సిబ్బంది సుధాకర్ ఇంటికి వెళ్లి ఎలాంటి అనుమతులు, పత్రాలు లేకుండా ప్రభుత్వ భూమిని చదును చేయడం చట్టరీత్యా నేరమని చెప్పారు. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా భూ ఆక్రమణకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. దీంతో ఆగ్రహించిన భూ ఆక్రమణ దారుడు సుధాకర్, అతని కుటుంబ సభ్యులు వీఆర్ఏను కులం పేరుతో దూషించారు. తహసీల్దార్ ఆదేశాల మేరకు భూ ఆక్రమణ దారుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

క్రీడా రిజర్వేషన్ పెంపుతో ఉపయోగం

స్టెప్ మాజీ సీఈఓ డాక్టర్ ఎం. రామచంద్రారెడ్డి


మాట్లాడుతున్న డాక్టర్ ఎం. రామచంద్రారెడ్డి

కడప స్పోర్ట్స్ : క్రీడల్లో రాణించే క్రీడాకారులకు వర్తించే 2 శాతం స్పోర్ట్స్ రిజర్వేషన్‌ను 3 శాతానికి పెంచడం ద్వారా క్రీడాకారులకు మేలు జరుగుతుందని స్టెప్ మాజీ సీఈఓ డాక్టర్ ఎం. రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. శనివారం కడప నగరంలోని వైఎస్ఆర్ ఇండోర్ స్టేడియంలో జిల్లాస్థాయి కబడ్డీ సీనియర్ విభాగం ఎంపికలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ కబడ్డీ క్రీడకు జిల్లాలో చక్కటి ఆదరణ ఉందన్నారు. జిల్లా క్రీడాకారులు ప్రో కబడ్డీలో సైతం ఆడటం క్రీడ ప్రాధాన్యత తెలియజేస్తోందన్నారు. జిల్లా క్రీడాకారులు బాగా సాధన చేసి రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించాలని ఆకాంక్షించారు. జిల్లా కబడ్డీ సంఘం కార్యదర్శి ఆర్. వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు డిసెంబర్ 5 నుంచి 8వ తేదీ వరకు ప్రకాశం జిల్లా సంతనూతలపాడులో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు. అనంతరం ఎంపికలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కబడ్డీ సంఘం వర్కింగ్ సెక్రటరీ టి. శ్రీవాణి, డీఎస్ఏ శిక్షకుడు ఆర్.వి. శ్రీధర్, ఫిజికల్ డైరెక్టర్లు సుబ్బన్న, లక్ష్మి, శ్రీనాథ్, నిత్యప్రభాకర్, లక్ష్మీ రామ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ కేసుల పరిష్కారానికి కృషి చేయాలి


ఎక్సైజ్ అధికారులతో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీదేవి

కడప అర్బన్ : కడపలోని జిల్లా కోర్టు ఆవరణంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ జి. శ్రీదేవి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్. బాబా ఫకృద్దీన్ తమ సిబ్బందితో కలిసి శనివారం ఎక్సైజ్ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీదేవి మాట్లాడుతూ డిసెంబర్ 14 వతేదీన నిర్వహించే జాతీయలోక్ అదాలత్‌లో ఎక్కువ సంఖ్యలో ఎక్సైజ్ కేసులు రాజీ అయ్యేవిధంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్ఆర్ జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి రవికుమార్, అన్నమయ్య జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి మధుసూదన్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌సీసీలో ప్రవేశాలపై సందిగ్ధత

సాక్షి టాస్క్‌ఫోర్స్ : 30 ఆంధ్రా బెటాలియన్ పరిధిలో వైఎస్ఆర్ కడప జిల్లాలో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించిన నేషనల్ కేడెట్ కార్ప్స్ (ఎన్‌సీసీ)లో ప్రవేశాల ప్రక్రియపై సందిగ్ధత కొనసాగుతూనే ఉంది. పాఠశాలలు, కళాశాలలు ప్రారంభమై దాదాపు 6నెలలు కావస్తున్నా ఇంకా ఎన్‌సీసీ ఏ, బీ సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాలకు ఎంపికలు నిర్వహించలేదు. కాగా గతంలో 30 ఆంధ్రా బెటాలియన్‌లో పలు అంశాలపై విచారణ, తిరుపతికి తరలింపు తదితర అంశాలపై ఎన్‌సీసీ కేడెట్స్, విద్యార్థి సంఘాలు ఆందోళన చేసిన నేపథ్యంలో కడప నగరంలోని పలు విద్యాసంస్థల్లో ఎన్‌సీసీ యూనిట్లను సస్పెన్షన్ విధించడంతో పాటు ఎన్‌సీసీలో ప్రవేశాలను నిలిపివేశారు. దీంతో పలు విద్యాసంస్థల నిర్వాహకులు, విద్యార్థులు ఎన్‌సీసీ ప్రవేశాలపై తరచుగా ఎన్‌సీసీ అధికారులను సంప్రదిస్తుండటంతో ఎన్‌సీసీలో ప్రవేశాల ప్రక్రియ నిర్వహించడం లేదంటూ ఎన్‌సీసీ యూనిట్లు ఉన్న విద్యాసంస్థలకు ఎన్‌సీసీ బెటాలియన్ నుంచి సమాచారం వచ్చినట్లు తెలుస్తోంది. దీంతో జిల్లాలోని విద్యాసంస్థల్లో ఎన్‌సీసీలో ప్రవేశాలు ఈ యేడాదికి లేనట్లుగా తెలుస్తోంది. విద్యార్థులు నష్టపోకుండా ఎన్‌సీసీ ప్రవేశాల ప్రక్రియ చేపట్టాలని పలువురు విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులు కోరుతున్నారు.